నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I హైదరాబాద్, శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 | SIDDIPET

## చెల్కలపల్లిని ముంపు గ్రామంగా గుర్తించాలి

- పునరావాస కేంద్రం.. ప్యాకేజీ ఇవ్వాలి
- 17 రోజులుగా ధర్నా చేస్తున్న ప్రజలను ఆదుకోవాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి లేఖ





చిన్నకోడూరు, ఫిబ్రవరి 6: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చెల్కలపల్లిని ముంపు గ్రామంగా గుర్తించి, వారికి ప్రత్యేక పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్యాకేజీ ఇవ్వాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూర్ మండలం చెల్కలపల్లి గ్రామ పరిధిలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అన్నపూర్ణ(అంతగిరి) రిజర్వాయర్ నిర్మించారు. నిర్మాణంలో భాగంగా పక్కన ఉన్న కొచ్చగుట్టపల్లి గ్రామంలో 104 కుటుంబాలను నిర్వాసితులుగా గుర్తించి ప్యాకేజీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించి ఇచ్చారు. దీనికి 50 మీటర్ల దూరంలో చెల్కలపల్లి గ్రామం ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. ఆ గ్రామంలో అప్పుడు ఎఫ్ఆర్ఎల్‌లో రెండు ఇండ్లు, నాలుగు కుటుంబాలు మాత్రమే ముంపునకు గురికావడంతో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం అదనపు టీఎంసీ కోసం జరుగుతున్న పంప్‌హౌస్ పనుల్లో భాగంగా బ్లాస్టింగ్, డంప్ యార్డ్ నిర్మాణంతో గ్రామానికి మూడు వైపులా అన్నపూర్ణ రిజర్వాయర్ నీళ్లు ఇండ్లకు చేరడంతోపాటు, డ్రైనేజీ ఇండ్లల్లోకి రావడం, చుట్టుపక్కల డంప్ చేయడం, సరైన సెల్ సిగ్నల్స్ లేకపోవడం, ఉన్న ఒక్క రోడ్డు మార్గం ఈ పనుల్లో తీసేయడంతో రవాణా సౌకర్యం లేకుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే విషయం నా దృష్టికి రావడంతో ఈ లేఖ ద్వారా మీ దృష్టికి తీసుకువస్తున్నానని హరీశ్‌రావు తెలిపారు. గతంలో సిద్దిపేట కలెక్టర్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్‌కు ఈ విషయాలపై లేఖ రాశారని, ఆ అంశాలను పరిగణలోకి తీసుకొని చెల్కలపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించి, నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజీతో పాటు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించాలని హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. 17 రోజులుగా గ్రామస్తులు నిరాహార దీక్ష, ధర్నాలు చేస్తున్నారని, వెంటనే ప్రభుత్వం చొరవ చూపి గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించి ఆదుకోవాలని కోరారు. గతంలోనే ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్‌కు, కలెక్టర్ లేఖ రాశారని, ఈ సందర్భంగా ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడి విషయాన్ని వివరించారు.



మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్, అఖిలపక్షం నాయకులు

# హైదరాబాద్ కంపు.. మాకొద్దు

- స్వచ్ఛమైన రాయారావు చెరువు కాలుష్యంగా మారే అవకాశం
- భూగర్భ జలాలు కలుషితం అవుతాయని ఆందోళన
- ప్రజల అభిప్రాయం తీసుకోవాలని ప్రజాప్రతినిధుల డిమాండ్
- మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రాస్తారోకో, నిరసన, బంద్‌లతో కదం తొక్కిన నాయకులు, ప్రజలు

## కాలుష్యం కోరల్లోకి నర్సాపూర్ పట్టణం



నర్సాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్, అఖిలపక్షం నాయకులు

నర్సాపూర్, ఫిబ్రవరి 6: కాలుష్య కోరల్లోకి నర్సాపూర్ పట్టణం వెళ్తుందంటేనే ప్రజలు భయపడుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఒకే ఒక్క నిర్ణయంతో నర్సాపూర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. గుమ్మడిదల, నర్సాపూర్ మండల పరిధిలోని పచ్చటి అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో నర్సాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో డంప్‌యార్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే గనుక జరిగితే అటవీ ప్రాంతంలో కురిసిన వర్షం నీరు డంపింగ్ యార్డు నుంచి నేరుగా నర్సాపూర్ రాయారావు చెరువులోకి చేరుతుంది. దీంతో చెరువులోని నీరు, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోతులు సైతం డంపింగ్ యార్డులో తిరిగి ఇండ్ల పరిసర ప్రాంతాల్లో తిరగడంతో జనాలు రోగాల బారిన పడే అవకాశాలున్నాయని ప్రజలు భావిస్తున్నారు. చెరువులో నీరు కలుషితం కావడంతో చేపలు మృత్యువాత పడి మత్స్యకారులు నష్టపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆవేదన చెందుతున్నారు. చెరువు ఆయకట్టు కింద సుమారు వెయ్యి ఎకరాల సాగుభూమి ఉందని, వాటి పరిస్థితి ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**తిరగబడుతున్న జనం**

అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గుమ్మడిదల, నర్సాపూర్ మండలాల ప్రజలు తిరగబడుతున్నారు. రాత్రికి రాత్రి గ్రామాల్లోని ప్రజలను, ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేసి టిప్పర్లలో మట్టిని తీసుకువచ్చి డంపింగ్ యార్డుకు రోడ్డు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ స్థానికులు నిరసనకు దిగారు. వందల మంది పోలీసులను మోహరించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి తీరుతామని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అయినా స్థానికులు, ప్రజాప్రతినిధులు అడ్డుకొని తీరుతామని నడుం బిగించారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సైతం ప్రభుత్వ ఆగడాలను ఊపేక్షించేది లేదంటూ ప్రజలకు మద్దతుగా నిలిచి అరెస్టు అయ్యారు. ఎంతమందిని అరెస్టు చేసినా డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ఒప్పుకునేది లేదంటూ గళం విప్పారు. ఉద్యమాన్ని తలపించేలా అఖిలపక్ష నాయకులు సైతం ముందడుగు వేశారు. రాస్తారోకోలు, ధర్నాలు, నిరసన, బంధులతో నర్సాపూర్ మారుమోగింది. డంపింగ్ యార్డ్ రద్దు చేసే వరకు ఊరుకునే ప్రసక్తే లేదంటూ ప్రజలు, యువకులు, నాయకులు కదం తొక్కారు.



నర్సాపూర్‌లో స్వచ్ఛందంగా మూసివేసిన దుకాణాలు

**ఆగని డంపింగ్ యార్డ్ పనులు**

ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు డంపింగ్ యార్డు వద్దంటూ నిరసనలు, రాస్తారోకోలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్టు కూడా లేదు. ఎవరెంత గొడవలు చేసినా, కన్నీరు పెట్టుకున్నా డంపింగ్ యార్డ్ పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు. రాత్రి సమయాల్లో టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకువచ్చి డంపింగ్ యార్డుకు రోడ్డును నిర్మిస్తున్నారు. పగలు డంపింగ్ యార్డు పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.ఎవరిని అటు వైపు రానివ్వకుండా పోలీసులు, సీఆర్పీఎఫ్ దళాలు పహారా కాస్తున్నారు.

**డంప్‌యార్డు రద్దుచేసే వరకు ఉద్యమిస్తాం**

పచ్చని అటవీ ప్రాంతాన్ని కాలుషితం చేసే డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని రద్దు చేయకుంటే ఉద్యమిస్తాం. డంపింగ్ యార్డ్ వల్ల రోజుకు 200 వాహనాలు రోడ్లపై తిరుగుతాయి. దీంతో ప్రమాదాలు చాలా పెరుగుతాయి. ప్రభుత్వం వెంటనే అనుమతులను రద్దు చేయాలి. ఎన్ని ఇబ్బందులు కలిగినా రైతులను, ప్రజలను కాపాడుకుంటాం. అన్ని పార్టీలను కలుపుకొని ముందుకు వెళ్తాం. దీనికి కాంగ్రెస్ నాయకులు కూడా సహకరించి కలిసి రావాలి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించడంతో డంపింగ్ యార్డు నిర్మాణాన్ని ఆపేశాం. కానీ నేడు కాంగ్రెస్ నాయకులు స్పందించడం లేదు. ప్రజాభిప్రాయం తీసుకోకుండానే ప్రభుత్వానికి మొండి వైఖరి తగదు. **– సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే**

## టెన్త్ విద్యార్థులకు డిజిటల్ కంటెంట్స్

- మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతో విద్యార్థులకు చేరిక
- 2500 మందికి అందిన డిజిటల్ కంటెంట్ బుక్స్
- హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు





డిజిటల్ కంటెంట్ బుక్స్‌తో పాఠాలు వింటున్న విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 6: అన్నింటా ఆదర్శంగా ఉన్న సిద్దిపేట.. పదోతరగతి ఫలితాల్లో సైతం ముందు ఉండాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సంకల్పించారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే డిజిటల్ కంటెంట్ బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేస్తూ వారికి చేయూతనిస్తున్నారు. అందులో భాగంగా హరీశ్‌రావు పంపించిన డిజిటల్ కంటెంట్ బుక్స్ పదోతరగతి విద్యార్థులకు చేరాయి. సొంత ఖర్చులతో సిద్దిపేట నియోజకవర్గంలో 2500 మంది విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు భోధించిన పాఠాలను ఇంకా సులువుగా రివిజన్ చేసుకునేలా ఈ డిజిటల్ కంటెంట్‌ను తయారు చేశారు. ఈ క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌లో లింక్ చేయగానే ప్రాక్టికల్ ఆధారిత పాఠాలు ప్రత్యక్షమవుతాయి. మూడేండ్ల నుంచి సిద్దిపేట జిల్లాలో 10వేల మందికి పైగా విద్యార్థులకు అన్ని రకాల సబ్జెక్ట్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ పుస్తకాలను మాజీ మంత్రి హరీశ్‌రావు పంపిణీ చేశారు. డిజిటల్ కంటెంట్ ఎంతగానో ఉపయోగపడిందనే విషయాన్ని విద్యార్థులు స్వయంగా చెప్పడమే కాకుండా ఎస్సెస్సీ ఫలితాల్లోనూ నిరూపించారు. డిజిటల్ ప్రోత్సాహం అందిస్తున్న హరీశ్‌రావుకు తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ డిజిటల్ కంటెంట్ బుక్స్ తమకెంతో ఉపయోగపడుతాయని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## ప్రాణాలైనా అర్పిస్తాం.. డంపింగ్ యార్డు ఆపేస్తాం..

- సంగారెడ్డి కలెక్టరేట్ ధర్నాలో హోరెత్తిన నినాదాలు
- గుమ్మడిదల డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతాలక్ష్మారెడ్డి నిరసన
- డీఆర్వోకు వినతిపత్రం అందజేత



సంగారెడ్డి డీఆర్వో పద్మజారాణికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ప్రాణాలైనా అర్పిస్తాం... డంపింగ్ యార్డు ఆపేస్తాం.. అంటూ గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నినాదాలు హోరెత్తాయి. గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, గుమ్మడిదల గ్రామస్తులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం డీఆర్వో పద్మజారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంప్ యార్డు పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలంలో సాగు భూమితోపాటు అత్యధిక శాతం అటవీ ప్రాంతం అయినందున, జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డుతో పచ్చని పంట పొలాలతోపాటు అటవీ ప్రాంతం కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు వద్దంటూ నిరసనలు.. ఆందోళనలు



నల్లవల్లిలో డంపింగ్ యార్డు వద్దంటూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- నల్లవల్లి, ప్యారానగర్‌లో ఉద్రిక్తత వాతావరణం
- చెత్తకుప్పలతో మా బతుకుల్లో నిప్పులు రాజేయొద్దు
- ఎవుసాన్ని నమ్ముకొని బతుకుతున్నం..పచ్చని పొలాలను కలుషితం చేస్తే ఊరుకునేది లేదు..
- డంపింగ్ యార్డు పెడితే చస్తామంటూ సెల్ టవర్ఎక్కి నిరసనలు


గుమ్మడిదల, ఫిబ్రవరి 6: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి, ప్యారానగర్‌లో గురువారం నిరసనలు.ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. మహానగరం చెత్తను పచ్చని అడవిలో వేయడానికి జీహెచ్ఎంసీ అధికారులు నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలు రెండోరోజు ఆందోళనలు, నిరసనలు తీవ్రతరం చేశారు. గురువారం పొద్దున్నే పొయ్యిలు కూడా రాజేయకుండా, వాకిళ్లు ఊడ్చకుండా ఇండ్ల నుంచి బయటకు వచ్చారు. గ్రామస్తులంతా కలసి గ్రామంలో బైఠాయించి డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని కాంగ్రెస్ సర్కారుకు, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసనలు, నినాదాలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఎండల్లో ఆందోళన కొనసాగాయి. డంపింగ్ యార్డు నిర్ణయాన్ని వెనుక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామంలో ముగ్గురు యువకులు సెల్‌టవర్ ఎక్కి చస్తామంటూ నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు, అధికారులు అక్కడి చేరుకుని ఎంత వారించినా వినిపించుకోకుండా డంపింగ్ యార్డు నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు గ్రామంలోనే ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న మాజీ సర్పంచ్‌లను, మాజీ ఎంపీటీసీలను బీఆర్ఎస్ నాయకులను, యువకులను పోలీసులు అరెస్ట్ విషయం తెలిసిందే. బుధవారం పెద్దఎత్తున పోలీస్ బలగాలతో డంపింగ్ యార్డు పనులు ప్రారంభించారు. బుధవారం రాత్రి కూడా పెద్ద ఎత్తున వందల సంఖ్యలో జీహెచ్ఎంసీ వాహనాలతో మట్టిని తీసుకొచ్చి డంపింగ్ యార్డు పనులు చేస్తున్నారు. ఈ తంతూ చూసిన నల్లవల్లి, ప్యారానగర్ గ్రామస్తులు డంపింగ్ యార్డుతో మా గ్రామాలను వల్లకాడు చేస్తారా..? అని ఆగ్రహంతో ప్రభుత్వంపై రగిలిపోతున్నారు. డంపింగ్ యార్డు నిర్ణయాన్ని సీఎం రేవంత్ సర్కారు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మా బతుకులు ఎవుసంతోనే ముడి పడ్డాయని, డంపింగ్ యార్డుతో సాగుకు యోగ్యమైన పంట పొలాలను బూడిద చేస్తామంటే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ప్రజాపాలనను రజాకారుల పాలన చేస్తున్నారన్నారు.

## మా ఆరోగ్యాలు పాడుచేయొద్దు

**మంత్రి దామోదర రాజనర్సింహను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు**

- డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలని నిరసన
- గుమ్మడిదలలో అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు
- స్వచ్ఛందంగా బంద్ పాటించిన వాణిజ్య, వ్యాపార, పరిశ్రమలు
- డంపింగ్ యార్డు పరిసరాల్లో పోలీస్ బందోబస్తు

గుమ్మడిదల, ఫిబ్రవరి 6: ఆరోగ్య మంత్రి గారూ.. మా ఆరోగ్యాలను పాడు చేయొద్దు అంటూ మంత్రి దామోదర రాజనర్సింహను బీఆర్ఎస్ నాయకులు వేడుకున్నారు. మహానగరం చెత్తతో మా అనారోగ్యాలకు కారణం కావొద్దంటూ అఖిలపక్షాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం గుమ్మడిదలలో అఖిలపక్షం ఇచ్చిన పిలుపు మేరకు బంద్ పాటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రహదారిపై ర్యాలీగా వచ్చారు. దీనికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై నాయకులతో కలిసి డంపింగ్‌యార్డు వద్దంటూ అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుమ్మడిదల, నర్సాపూర్, శివ్వంపేట మండలాల ప్రజలకు డంపింగ్ యార్డుతో ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ సర్కారు డంపింగ్ యార్డు ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయం లేకుండా రేవంత్ సర్కారు డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం అంటే ఇదేనా ప్రజాపాలనా? అని మండిపడ్డారు. వ్యవసాయం చేసుకుని బతికే ప్రజలకు అన్యాయం జరుగుతుందంటే ఊరుకునేది లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా యువ నాయకులు వెంకటేశం గౌడ్, మాజీసర్పంచ్ నర్సింహారెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, మొద్దు సర్కారుకు నిరసనగా రహదారిపై మొద్దును కాల్చి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారుల వద్దకు చేరుకొని చెదరగొట్టారు. డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కగా, మరో యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డు వద్ద పోలీసులు, సీఆర్పీఎస్ సిబ్బంది బారికేడ్లు పెట్టి అటువైపు ఎవరూ రాకుండా ఏఎస్పీ సంజీవ్‌రావు పర్యవేక్షణలో పహారా కాస్తున్నారు. గుమ్మడిదల మున్సిపల్‌తోపాటు మంభాపూర్, నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్, బొంతపల్లి, దోమడుగు, అన్నారం గ్రామాల్లో పోలీసు బలగాలను మోహరించి ఎలాంటి ఆందోళనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు బంద్‌కు పిలుపునివ్వడంతో బొంతపల్లి, గుమ్మడిదల, దోమడుగు, మంభాపూర్ తదితర గ్రామాల్లో స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేసి మద్దతుగా నిలిచారు.



గుమ్మడిదలలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే, అఖిలపక్షం నాయకులు

## సాగునీటి కోసం రైతుల ధర్నా



కొండపోచమ్మ కాల్వల ద్వారా చెరువులు నింపాలని ధర్నా చేస్తున్న రైతులు

రాయపోల్, ఫిబ్రవరి 6: కొండపోచమ్మ కాల్వల ద్వారా చెరువులు నింపకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని ముబారాస్‌పూర్, మల్లేశంపల్లి, హైమద్‌నగర్ గ్రామాల రైతులు గురువారం ఉప్పరపల్లి కెనాల్ వద్ద ధర్నా చేశారు. రైతులు ఆగ్రహంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాల్వల ద్వారా చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వెంటనే స్పందించి కొండపోచమ్మ ద్వారా ఉప్పరపల్లి కెనాల్ నుంచి చెరువులు నింపాలని కోరారు. రైతులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్, ఇరిగేషన్ అధికారులు రైతుల వద్దకు చేరుకొని రెండు, మూడు రోజుల్లో చెరువులు నింపుతామని భరోసా ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఆందోళనలో మూడు గ్రామాల రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను నియమించాలని బడికి తాళం



సిద్దిపేట జిల్లా దౌలాపూర్‌లో బడికి తాళం వేసి నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- ఏడు తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులు
- 120 నుంచి 80కి పడిపోయిన విద్యార్థుల సంఖ్య
- సిద్దిపేట జిల్లా దౌలాపూర్‌లో విద్యార్థులతో కలిసి తల్లిదండ్రుల నిరసన
- ఎంఈవోకు వినతిపత్రం అందజేత

జగదేవపూర్ ఫిబ్రవరి 6: సిద్దిపేట జిల్లా దౌలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడు తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండడంతో బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు బడికి తాళం వేసి నిరసన తెలిపారు. అనంతరం మండల వనరుల కేంద్రానికి చేరుకొని మండల విద్యాధికారి మాధవరెడ్డికి వినతిపత్రం అందించి, పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ...గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గతంలో 120 మంది విద్యార్థులుండగా నేడు ఆ సంఖ్య 80కి చేరిందన్నారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులంతా ప్రైవేటు బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 7 తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులతో బోధన ఎలా చేస్తారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను కేటాయించకపోతే విద్యార్థుల సంఖ్య ఇంకా తగ్గుతుందని, మిగిలిన కొంతమంది విద్యార్థులు ప్రైవేటుకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలకు రెండు మూడు రోజుల్లో టీచర్లను నియమించాలని, లేనిపక్షంలో జగదేవపూర్ ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తామని హెచ్చరించారు. దీంతో ఎంఈవో మాధవరెడ్డి జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి తక్షణం ఒక టీచరును డిప్యూటేషన్‌పై పంపించనున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు టీచర్లను వారం రోజుల్లో నియమిస్తామని, 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకాలతో పూర్తిస్థాయిలో భర్తీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సైదులు, కొండపోచమ్మ దేవాలయ మాజీచైర్మన్ ఉపేందర్‌రెడ్డి, నాయకులు జయమ్మ, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

అక్కన్నపేట, ఫిబ్రవరి 6: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన తల్లీకూతురు సారవ్వ, మమత ఇటీవల ఉపాధిహామీ పనులకు వెళ్లి మృతిచెందిన విషయం తెలిసిందే. గురువారం మృతుల కుటుంబాలను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధిహామీ పనులకు వెళ్లి చనిపోయిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, గాయపడిన కూలీలకు రూ.15 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మంత్రి హోదాలో ఉన్న నియోజవకర్గ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని మృతుల కుటుంబాల్లో ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. ఆయన వెంట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, గడిపె మల్లేశ్, జాగీరు సత్యనారాయణ, ఏడల వనేశ్, కొయ్యడ కొమురయ్య, సుదర్శనాచారి, పరశురాములు పాల్గొన్నారు.



గోవర్ధనగిరిలో మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి